# మేధావి

'క్షేమయ్యా?'

'ప్రభూ! ఇక్కడే వున్నా-'

'నిన్న మన పట్టాభిషేక సమయంలో నన్ను ప్రజలకు పరిచయం చేస్తూ ఏదో అన్నావోయ్-?'

'ఏ మన్నాను ప్రభూ?'

'జ్ఞాపకం చాలదోయ్-'

'ఏ సందర్భంలోనో కొంచెం తమరు శెలవిస్తే...'

'నా సుగుణాలను ఎకరుపెడుతూ నేనేదో పేర్ధ-వాణ్ణన్నావు-'

'ఓహోహో! అదాండీ? తమరూ, గొప్ప మేధావులన్నా-'

'మేధావి నా-అంటే?'

'గొప్ప మేధగలవారని-'

'మేధంటే-'

'మెదడండి-జ్ఞానేంద్రియం-'

'ఎక్కడుంటుందా పదార్థం?'

'తమ తలకాయలోనండి-బత్తాయి కాయంత వుంటుంది-'

'అది నా వొక్కడికే వుంటుందా?'

'లేదండి-అందరికీ వుంటుంది'

'అయితే నా గొప్పేమిటీ?'

'మీ గొప్ప మీ మేధే! అందరిదీ ఉసిరికాయంత ఉంటే, మీది-'

'సైజు పెద్దదంటావా నాది?'

'సైజేకాదండి-అంతస్తు కూడాను-'

'అంటే?'

'తమ తలకాయలోవున్న ఈ మేధాయంత్రం సామాన్యులందరికీ వుండేటటువంటిది కాదు-ప్రభువులకి మాత్రమే అటువంటిది-అంత పెద్దది వుంటుంది-'

'బాగా విశాలంగా చెబుతావా?'

'చిత్తం! తమ రాజ్యంలో ఎవరికీకూడా తమకు వుండేటంత గొప్ప-మేధ లేదు-'

'అలాగనా? అయితే ఇది ఎందుకు పనికి వస్తుందంటావు?''

'బుద్ధి వికాసాదులను ఇచ్చేది అదేనండి-తమరి చేతులు కత్తిపట్టుకుని యుద్ధం చేస్తాయి, కాళ్లు నడుస్తాయి, కళ్లు చూస్తాయి-ఇలాగే ఏ అవయవం అది చేయవలసినపనిని చేస్తుంది-వీటన్నిటి చేతా ఆ పనులను చేయించేది మెదడు-ఇది చిన్నదైతే-చిన్న చిన్న పనులనే చేయిస్తుంది-పెద్దదైతే-తమకు వుండేలాంటిదైతే బ్రహ్మాండమైన పనులను చేయిస్తుంది-'

'ఎలాగో కాస్త విడమరిచి చెప్పూ-?'

'నా మెదడు చిన్నది-గనక, నేను మంత్రిగానే వున్నాను. తమరిది పెద్దది-మీరు ప్రభువులై పాలిస్తున్నారు-'

'అర్థమైంది-'

'ధన్యుణ్ణి'

'అయితే, ఇది నాకు చాలా విలవైందన్నమాట?'

'మీ రాజరికం దాని మీదే ఆధారపడి వుంది-'

'అంటే, అది నాకూ, నా రాజరికానికీ చాలా ముఖ్యమయిందన్నమాట?'

'చిత్తం!'

'అయితే నేను, దాన్నిగురించి చాలా జాగ్రత్త తీసుకోవాలి కదూ?'

'దేన్ని గురించండీ?'

'ఈ మెదడును గురించి-?'

'అవునండి! దాన్ని ఏ మాత్రం అలసట చెందనీకండా, జాగ్రత్తగా కాపాడుకోవాలి-'

'మన ఖజానాలో డబ్బుకు మల్లే కదూ?,

'ఒక విధంగా చూస్తే-అంతేనండి!'

'అయితే దాన్నితీసి పదిలంగా ఖజానాలో దాచమని చెప్పు!'